నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, బుధవారం 12 జూన్ 2024 | BHADRADRI KOTHAGUDEM

నగరంలోని రిక్కాబజార్ పాఠశాలలో అధ్వానంగా ఉన్న టాయిలెట్స్

ఈ చిత్రాలు చూశారా.. జిల్లాకేంద్రం ఖమ్మం నగరంలోని నడిబొడ్డున ఉన్న పాత బస్టాండ్ వద్ద గల రిక్కాబజార్ పాఠశాలలోనివి. నిత్యం కలెక్టర్, మంత్రులు తిరుగుతున్న ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలలోనే మూత్రశాలల దుస్థితి ఇలా ఉందంటే.. మిగతా వాటి పరిస్థితి ఏంటో అర్థం చేసుకోవచ్చు. బుధవారం నుంచి బడులు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా విద్యార్థులకు ఇలాంటి సమస్యలెన్నో స్వాగతం పలుకుతున్నాయి.

నేటి నుంచి బడిగంట

- ప్రారంభంకానున్న కొత్త విద్యా సంవత్సరం
- ప్రభుత్వ పాఠశాలల్లో వీడని సమస్యల తంటా
- పూర్తిస్థాయిలో సన్నద్ధం కాని బడులు
- వంతుల వారీగా నిర్వహించిన బడిబాట
- కుట్టు పనుల కోసం ఇతర జిల్లాలకు తరలిన ఉచిత యూనిఫాం
- భర్తీకాని ఉపాధ్యాయ పోస్టులు

ఖమ్మం, జూన్ 11 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు ఈ నెల 12వ తేదీ బుధవారం పునఃప్రారంభం కానున్నాయి. ఖమ్మం జిల్లాలోని అత్యధిక ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థులకు సమస్యలతో స్వాగతం పలుకనున్నాయి. ప్రభుత్వం, జిల్లా అధికార యంత్రాంగం గొప్పలు చెబుతున్న పరిస్థితి క్షేత్రస్థాయిలో లేదు. తాగునీటి సరఫరా మొదలు టాయిలెట్స్, విద్యుత్ సరఫరా వంటివి ఖమ్మం నగరంలోని ప్రధాన కూడళ్లలో ఉన్న పాఠశాలల్లోనే అధ్వానంగా ఉన్నాయంటే.. గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలల పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. మన ఊరు-మన బడి ద్వారా గత కేసీఆర్ ప్రభుత్వం పాఠశాలలను అద్భుతంగా తీర్చిదిద్దింది. అయితే ప్రస్తుత ప్రభుత్వంలో అధికారుల కనీస పర్యవేక్షణ లేకపోవడంతో పాఠశాలలు అధ్వానంగా తయారయ్యాయి.

వంతుల వారీగా బడిబాట

రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 6వ తేదీ నుంచి బడిబాట కార్యక్రమాన్ని మొదలుపెట్టింది. అయితే జిల్లాలోని చాలా స్కూళ్లలో టీచర్లు వంతుల వారీగా హాజరై మమ అనిపించినట్లు ఆరోపణలున్నాయి. కలెక్టర్ వీపీ గౌతమ్, డీఈవో సోమశేఖర శర్మ ఏయే మండలాలకు హాజరవుతున్నారో ముందుగానే తెలుసుకొని ఆరోజు మాత్రమే కొంతమంది ఉపాధ్యాయులు బడిబాటలో పాల్గొంటున్నారంటే అతిశయోక్తి కాదు. మరికొందరు ఉపాధ్యాయులు బడిబాటలో పాల్గొనకపోయినప్పటికీ హాజరైనట్లు తప్పుడు నివేదికలను అధికారులకు అందజేస్తున్నారు. వీరికి కొందరు ఎంఈవోలు సైతం సహకారం అందిస్తున్నట్లు డీఈవోకి మౌఖికంగా ఫిర్యాదులు కూడా అందాయి.

కట్టేవారున్నా.. కుట్టేవారేరి?

ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు రెండు జతల యూనిఫాం రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్నది. యూనిఫాంలను కుట్టేందుకు మండలాల వారీగా అక్కడ ఎస్ హెచ్‌జీ గ్రూప్‌లకు క్లాత్‌ను అందించాలని ఆదేశించింది. కుట్టేవారు లేకపోతే డీఆర్‌డీఏ, మెప్మాల పరిధిలో కుట్టించాలని ఆదేశాల్లో స్పష్టంగా పేర్కొంది.. కానీ.. ఖమ్మం జిల్లాలో మాత్రం అత్యధికంగా యూనిఫాం ఇతర జిల్లాలతోపాటు వేరే రాష్ట్రానికి కూడా తరలివెళ్లింది. ఏపీ రాష్ట్రంలోని గుంటూరు, కృష్ణా జిల్లాలో సైతం ఉచిత యూనిఫాంను కుట్టిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఇదిలా ఉంటే.. కుట్టు పనులు 95 శాతం పూర్తయ్యాయని అధికారులు చెబుతున్నప్పటికీ వాస్తవంలో మాత్రం 60 శాతంలోపే సిద్ధమైనట్లు తెలుస్తున్నది.

టీచర్ పోస్టుల భర్తీ జరిగేనా?

జిల్లాలో ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు 1,004 ఉండగా.. ఉన్నత పాఠశాలలు 214 వరకు ఉన్నాయి. వీటిల్లో చదువుతున్న విద్యార్థులకు తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో బోధన నిర్వహిస్తున్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం తీసుకున్న చర్యల వలన అన్ని మారుమూల ప్రాంతాల్లోని పాఠశాలలకు టీచర్లను కేటాయించారు. ప్రస్తుత ప్రభుత్వ పాలనలో ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయుల స్థానాలు, ఖాళీలను భర్తీ చేసేందుకు ఎలాంటి చర్యలు తీసుకోకుండానే బడులు పునఃప్రారంభమవుతున్నాయి. జిల్లావ్యాప్తంగా ఉన్న పాఠశాలల్లో మంజూరైన పోస్టులు 5,755. వీటిల్లో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో కలిపి 3,197 మంది కాగా.. ఉన్నత పాఠశాలల్లో 2,558 మంది పని చేయాల్సి ఉంది. 2024 జూన్ 1 నాటికి 4,629 మంది ఉపాధ్యాయులు పనిచేస్తుండగా.. 1,126 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ పోస్టుల స్థానంలో విద్యా వలంటీర్లను నియమిస్తారా..? ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

విద్యార్థులకు ఇబ్బంది రానివ్వం..

పాఠశాలల పునఃప్రారంభానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఒక జత యూనిఫాం పూర్తయింది. రెండో జత సిద్ధమవుతున్నది. 6వ తరగతికి సంబంధించిన పుస్తకాల విషయంలో కొన్ని మండలాలకు తక్కువ వచ్చాయి. దీనిపై ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చాం. నోట్ పుస్తకాలు కూడా మండలాలకు సరఫరా చేశాం. ఎక్కడైనా టాయిలెట్స్ సమస్యలు ఉంటే మరమ్మతులు చేపడతాం.. విద్యార్థులకు ఇబ్బందులు రాకుండా చూస్తాం.

–సోమశేఖర శర్మ, డీఈవో, ఖమ్మం

వివరాల్లేకుండా సమీక్షకెలా వస్తారు?

ఇకపై సాకులు చెప్పొద్దు.. మొదటిసారి కాబట్టి వదిలేస్తున్నా..

నియోజకవర్గాల్లో సమస్యలుంటే ఎమ్మెల్యేలకు చెప్పండి

రెవెన్యూ, హౌసింగ్ శాఖల సమీక్షలో మంత్రి పొంగులేటి

మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 11 (నమస్తే తెలంగాణ): 'సమగ్ర వివరాలు లేకుండా సమీక్షకు ఎలా వస్తారు? ఇకపై సాకులు చెప్పొద్దు.. మొదటిసారి కాబట్టి వదిలేస్తున్నా..' అంటూ భద్రాద్రి జిల్లా అధికారులపై రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల జిల్లా స్థాయి సమీక్ష సమావేశాన్ని భద్రాద్రి ఐడీవోసీ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. తదుపరి సమీక్ష నాటికి అధికారులు సరైన వివరాలతో రావాలని సూచించారు. అప్పటికీ లోపాలుంటే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఈ ప్రభుత్వంపై ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నందున అధికారులు అందుకు అనుగుణంగా పనిచేయాలని సూచించారు. నియోజకవర్గాల్లో సమస్యలుంటే ఎమ్మెల్యేలను సంప్రదించాలని, వారి ద్వారా ఆయా సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్లు, తాగునీరు, విద్య, వైద్యం, గ్రామీణ రోడ్లు, కల్వర్టుల మీద సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని అన్నారు. అర్హులైన వారికి ఆసరా పింఛన్లు అందించాలని, గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలని, అంగన్‌వాడీలు, ప్రభుత్వ పాఠశాలల్లో మరమ్మతులుంటే వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. నియోజకవర్గ ప్రజాప్రతినిధులను సంప్రదించి పాఠశాలల పునఃప్రారంభాన్ని పండుగ వాతావరణంలో చేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న ధరణి సమస్యలను పరిష్కరించాలన్నారు. వర్షాకాలం ప్రారంభమైనందున వైద్య శాఖ అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, పాయం వెంకటేశ్వర్లు, కోరం కనకయ్య, మాలోత్ రాందాస్‌నాయక్, తెల్లం వెంకట్రావు, జారె ఆదినారాయణ, కలెక్టర్ ప్రియాంక, ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, డీఆర్‌వో రవీంద్రనాథ్, ఆర్డీవోలు మధు, దామోదర్‌రావు, డీఎఫ్‌వో కృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు అందించాలని ధర్నా

ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

ఇల్లెందు రూరల్, జూన్ 11: ఇల్లెందు పట్టణం సీఎస్‌పీ బస్తీలోని దేవులపల్లి యాకయ్య నగర్, సున్నం రాజయ్యనగర్‌లో పేదలకు తాగునీరు అందించాలని సీపీఎం ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి అబ్దుల్ నబి మాట్లాడుతూ.. సమస్యను పరిష్కరించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మన్యం మోహన్‌రావు, ఆలేటి కిరణ్, తాళ్ళూరి కృష్ణ, రాందాస్, హుస్సేన్, వెంకన్న, వీరస్వామి, సుజాత, కౌసల్య, కోటమ్మ, నీలారాణి, భవాని, హబీబున్నిసా, మలేఖా, రేష్మా, జ్యోతి, నాగమణి, లక్ష్మి, మంగ, మహేశ్వరి, ఆనంద్, ప్రసాద్, సరిత, సుగుణ, పాల్గొన్నారు.

ఉత్తమ విద్యా నిలయాలు...
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా విద్యాసంస్థలు

Admissions are Progress
మీతోటే విద్యాసంవత్సరాలు విజయవంతం అవుతూ... మీతోటే విద్యార్థులకు లక్ష్యాలు ప్రారంభమైనవి
మార్గదర్శిని విద్యాసంస్థలు
ఇల్లందు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

Admissions are in progress
"Create the Best Future for Your Child"
Nursery to 7th Class
English Medium School
P.SWARNA B.Sc.B.Ed Head Mistress
P.RAMESH M.A. Correspondent
GEETHANJALI VIDYANIKETAN
Budidhagadda, Kothagudem, cell : 9849804211

2024-2025 విద్యాసంవత్సరం ప్రారంభం
బడి ఈడు పిల్లలను పాఠశాలకు పంపించండి
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా
విద్యార్థినీ, విద్యార్థులు, వారి యొక్క తల్లిదండ్రులు

Admissions are Progress
MODREN IQRA SCHOOL
Nursery to 10th
(ENGLISH MEDIUM Only)
SCB NAGAR, RAMAVARAM
KOTHAGUDEM, Cell : 9490788164

2024-2025 విద్యాసంవత్సరం ప్రారంభం
అడ్మిషన్లు జరుగుచున్నవి
KLR INSTITUTIONS
PALONCHA -507115, BHADRADRI KOTHAGUDEM DIST
KLR COLLEGE OF ENGINEERING & TECHNOLOGY, PALONCHA
B.TECH, M.TECH, MBA, DIPLOMA
EAMCET CODE : KLRT
KLR PHARMACY COLLEGE, PALONCHA
B.PHARMACY
PHARM(D) & PHARM D (PB), M.PHARMACY
COLLEGE CODE : KRCP
LENORA INSTITUTE OF DENTAL SCIENCES
RAJANAGARAM-RAJAHMUNDRY
MDS, BDS & PG DIPLOMA
COLLEGE CODE : LIDS
KLR COLLEGE OF PHYSIOTHERAPHY, PALONCHA
BPT
KLR COLLEGE OF EDUCATION, PALONCHA
B.ED
ED-CET CODE : KRCP
KLR DEGREE & PG COLLEGE, PALONCHA
KLR JUNIOR & VOCATIONAL JUNIOR COLLEGE, PALONCHA
NEW INDIRA PRIYADARSINI SCHOOL PALONCHA

నేటి అలసత్వం.. రేపటికి మూల్యం?

బడి బస్సు భద్రత తుస్సు

బడి బస్సు పత్రాలు తనిఖీ చేస్తున్న రవాణా శాఖ అధికారులు

- భద్రాద్రి జిల్లాలో ఇంకా ఫిట్‌నెస్ టెస్ట్ చేయించని బడి బస్సులు 141
- కేవలం 88 బస్సులకు మాత్రమే సామర్థ్య పరీక్షలు పూర్తి
- స్కూళ్ల ప్రారంభం నేపథ్యంలో తల్లిదండ్రుల్లో ఆందోళన
- రవాణా శాఖ నిబంధనల్లో సింహభాగానికి పైగా మంగళం?

చుంచుపల్లి, జూన్ 11: విద్యాసంవత్సరం మొదలై బుధవారం నుంచి పాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రైవేటు పాఠశాలల బస్సుల ఫిట్‌నెస్‌పై తల్లిదండ్రుల్లో ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల పట్ల ఆసక్తి పెరుగుతుండడంతో ప్రీ స్కూల్, ప్లే స్కూల్, నర్సరీ సహా కేజీ నుంచి పీజీ వరకూ తమ పిల్లలను వాటిల్లోనే చదివించేందుకు తల్లిదండ్రులు మొగ్గుచూపుతున్నారు. తల్లులందరూ వేకువజామునే నిద్రలేచి పరుగులతో పనులు చేసి, పిల్లలను రెడీ చేసి, క్యారియర్లు కట్టి ఉంచి.. స్కూల్ బస్సు వచ్చే వేళకు అన్నీ సిద్ధం చేస్తారు. హారన్ మోగిస్తూ బస్సు రాగానే వారిని అందులో ఎక్కించి బాయ్ చెబుతారు. కానీ.. ఆ బస్సు అలా మూలమలుపు తిరగ్గానే తల్లిదండ్రుల్లో ఆందోళన మొదలవుతోంది. ఈ వేసవి సెలవుల్లో ఆ స్కూల్ బస్సుకు ఫిట్‌నెస్ టెస్టులు చేయించారో? లేదో? బస్సుల కండిషన్ పర్‌ఫెక్ట్‌గా ఉందో? లేదో? అనే సందేహాలు వెంటాడుతున్నాయి. మళ్లీ సాయంత్రం వారు క్షేమంగా ఇంటికి చేరుకునేదాకా ఒకటే కంగారు. సరిగ్గా వీరి ఆందోళనకు అద్దం పడుతున్నాయి ప్రైవేటు విద్యా సంస్థల యాజమాన్యాల నిర్లక్ష్యాలు. భద్రాద్రి జిల్లాలో మొత్తం 229 బడి బస్సులు ఉండగా.. వాటిల్లో కేవలం 88 బస్సులకు మాత్రమే ఇప్పటి వరకూ ఫిట్‌నెస్ టెస్టులు పూర్తయ్యాయి. ఇంకా 141 బస్సులకు ఆయా యాజమాన్యాలు సామర్థ్య పరీక్షలు చేయించనే లేదు. దీంతో ప్రైవేటు విద్యాసంస్థల నేటి అలసత్వమే రేపటికి మూల్యంగా పరిణమించే ప్రమాదముందని తల్లిదండ్రులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

అడుగడుగునా అలసత్వం..

పిల్లలకు మెరుగైన విద్య అందించేందుకు ఎంతటి ఖర్చుకైనా తల్లిదండ్రులు వెనుకాడకపోవడం, ఎంతటి నిర్లక్ష్యాన్నైనా భరిస్తుండడం వంటివి ప్రైవేటు విద్యాసంస్థలకు కలిసొస్తున్నాయి. బడి బస్సుల భద్రత గురించిగానీ, పిల్లలను తీసుకెళ్లే విషయంలో బాధ్యత గురించి తల్లిదండ్రులు పెద్దగా ప్రశ్నించలేకపోతున్నారు. విద్యాసంవత్సరం ప్రారంభం కాకముందే విద్యార్థులను రవాణా చేసే ప్రైవేటు విద్యాసంస్థల బస్సులను ఆయా యాజమాన్యాలు రవాణా శాఖ కార్యాలయాలకు తీసుకెళ్లి సామర్థ్య పరీక్షలు చేయించి సిద్ధంగా ఉంచాలి. అప్పటికే ముగిసిన ఇన్సూరెన్స్ గడువును పునరుద్ధరించుకోవాలి. బస్సుల నోటీసు బోర్డుపై తప్పనిసరిగా దాని వివరాలు, చోదకుడి వివరాలను ప్రదర్శించాలి. ప్రతి బస్సులోనూ ప్రథమ చికిత్స పెట్టెల్లో ఫస్ట్ ఎయిడ్ మందులను సిద్ధంగా ఉంచాలి. దెబ్బతిన్న ఇండికేటర్లను తొలగించాలి. అరిగిన టైర్ల స్థానంలో కొత్తవి అమర్చాలి. చివరికి సైడ్ మిర్రర్లను సక్రమంగా ఉంచాలి. కానీ.. వీటిల్లో సింహభాగానికి పైగా నిబంధనలను ఏ ఒక్క ప్రైవేటు విద్యా సంస్థ కూడా పాటించడం లేదు. కానీ.. ఏదైనా అనుకోని ఘటనలు జరిగినప్పుడు మాత్రం హడావిడి నెలకొంటోంది. మొత్తంగా ప్రైవేటు విద్యా సంస్థల నిర్లక్ష్యానికి ఒక్కోసారి తల్లిదండ్రులు మూల్యం చెల్లించుకోవాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి.

నిబంధనలు ఇవీ..

- మోటారు వాహనాల చట్టం ప్రకారం రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్, పర్మిట్, పన్ను చెల్లింపు రసీదు, పొల్యూషన్ అండ్ కంట్రోల్ సర్టిఫికెట్, డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలి. డ్రైవర్ ఫొటోను తప్పనిసరిగా బస్సులో ఏర్పాటు చేయాలి.
- డ్రైవర్‌కు ఐదేళ్ల అనుభవం ఉండాలి. గరిష్ఠంగా 60 ఏళ్ల వయస్సు మించకూడదు. డ్రైవర్‌కు తప్పక కంటి పరీక్షలు జరిపించాలి.
- బస్సు డ్రైవర్‌కు స్కూల్ యాజమాన్యం హెల్త్ కార్డు ఇప్పించి అతడికి ప్రతి మూడు నెలలకు ఒకసారి వైద్య పరీక్షలు చేయించాలి.
- డ్రైవర్ లైసెన్స్‌ను విద్యాసంస్థ యాజమాన్యం తప్పక తనిఖీ చేయాలి.
- డ్రైవర్ వివరాలను పేరెంట్స్ కమిటీకి అప్పగించాలి.
- సురక్షిత ప్రయాణం కోసం అటు డ్రైవర్‌కు, ఇటు విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలి.
- ప్రతి బస్సులో విద్యార్థుల అటెండెన్స్ తీసుకోవాలి.
- పది బస్సులకు ఒక అదనపు బస్సును ఏర్పాటు చేసుకోవాలి.
- ప్రతి నెలా స్కూల్ ప్రిన్సిపాల్, పేరెంట్స్ కమిటీ బాధ్యులు తప్పనిసరిగా బస్సును తనిఖీ చేయాలి.
- బస్సు నిర్వహణపై రిజిస్టర్ ఏర్పాటు చేయాలి.
- పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించకూడదు.
- బస్సు బ్యాటరీ, వైపర్స్, ఇండికేటర్లు సక్రమంగా పనిచేసేలా చూసుకోవాలి.
- బస్సులకు తప్పక పసుపు రంగు వేయాలి.

నిబంధనలు పాటించకుంటే చర్యలు..

నిబంధనలు పాటించని పాఠశాల బస్సులను ఎట్టి పరిస్థితుల్లోనూ రోడ్డెక్కనివ్వం. కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రతి బస్సుకూ పార్కింగ్ లైట్లు, బస్సులో ఒక సహాయకుడు ఉండాలి. ప్రయాణించే విద్యార్థుల చిరునామా, తల్లిదండ్రుల ఫోన్ నంబర్ వంటివి చార్ట్ రూపంలో ఉంచాలి. వాహన రిజిస్ట్రేషన్, పొల్యూషన్, బీమా పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్, ఆర్టీఏ జారీ చేసిన సామర్థ్య పరీక్షల ధ్రువపత్రాలు బస్సుల్లో అందుబాటులో ఉంచాలి. పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించకూడదు.

–తోట కిషన్‌రావు, ఇన్‌చార్జి డీటీవో, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య

- బడిబాటలో విద్యార్థుల నమోదు పెరగాలి
- రమణగుట్ట పర్యటనలో ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్

బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మం, జూన్ 11 : ప్రైవేటు పాఠశాలల్లో కంటే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని, ప్రతీ విద్యార్థి ఉన్నత స్థాయికి ఎదిగేలా ఉపాధ్యాయులు మెరుగైన బోధన అందిస్తున్నారని కలెక్టర్ వీపీ గౌతమ్ అన్నారు. ఖమ్మం నగరంలోని రమణ గుట్టలో మంగళవారం నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి ర్యాలీ తీస్తూ విద్యా ప్రాముఖ్యతను తెలిపే విధంగా నినాదాలు చేశారు. కలెక్టర్ ఇంటింటికీ తిరుగుతూ ఇంట్లో చదువుకున్న పిల్లలు ఉన్నదీ, ఏ పాఠశాలలో చదువుతున్నది అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించే విధంగా బడిబాట కార్యక్రమాన్ని ప్రభుత్వం ఈ నెల 6 నుంచి 19వ తేదీ వరకు నిర్వహిస్తుందని తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ ఉపాధ్యాయులు, సిబ్బంది ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతం పెరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి ఉత్తీర్ణతా శాతం పెరిగిందని, ప్రైవేట్ కంటే మెరుగ్గా ఫలితాలు సాధిస్తున్నామన్నారు. ఎలాంటి ఖర్చు లేకుండా ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యతోపాటు ఉచిత పాఠ్య, నోట్ పుస్తకాలు, దుస్తులు విద్యార్థులకు అందుతున్నాయని తెలిపారు. విద్యార్థులు ఐఐటీ, నీట్ ఫలితాల్లో మంచి ప్రదర్శన కనబరుస్తున్నారని, క్రీడా పోటీల్లో సైతం సత్తా చాటుతున్నారని అన్నారు. అంతకుముందు కలెక్టర్ ఎన్నెస్సీ కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించి.. అభివృద్ధి పనులను పరిశీలించారు. పాఠశాలకు యూనిఫాం, పాఠ్య పుస్తకాలు వచ్చాయా.. లేదా.. అని అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య, కొత్తగా ఎంతమంది నమోదయ్యారని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఈవో సోమశేఖర శర్మ, ఖమ్మం అర్బన్ ఎంఈవో శ్రీనివాసరావు, హెచ్ఎంలు శంకర్‌రావు, పద్మజ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వృక్షం.. నేలమట్టం!

- మద్దుకూరు హైస్కూల్‌లో భారీ వృక్షాలు నరికివేత
- భవనం కిందకు వేర్లు వెళ్తున్నాయనే సాకు..
- అధికారుల అనుమతి లేకుండానే తొలగింపు

మద్దుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నరికిన భారీ వృక్షాలు

చండ్రుగొండ, జూన్ 11 : ఊరూరా విరివిగా మొక్కలు నాటాలి. నాటిన మొక్కలను రక్షించాలి. భవిష్యత్ తరాల కోసం ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా మొక్కలు పెంచాలి.. మొక్కలతోనే మానవ మనుగడ.. అయితే ఇవన్నీ నినాదాలుగానే మిగిలిపోతున్నాయి ఇక్కడి పరిస్థితిని చూస్తుంటే. గత కేసీఆర్ ప్రభుత్వం హరితహారం కార్యక్రమాన్ని చేపట్టి విడతలవారీగా అధికారులను భాగస్వాములను చేసి విస్తృతంగా మొక్కలు నాటింది. అవి ఇప్పుడు వృక్షాలయ్యాయి. ఎక్కడికక్కడ నీడనిస్తున్నాయి. బాటసారులు సేద తీరేలా చేస్తున్నాయి. కానీ.. చండ్రుగొండ మండలం మద్దుకూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో రెండు దశాబ్దాలకు పైగా పెరిగిన భారీ వృక్షాలను మంగళవారం నిట్ట నిలువుగా నరికేశారు. పాఠశాల విద్యార్థులకు నీడ లేకుండా చేశారు. గ్రామస్తులు చూస్తుండగానే రంపాలు, గొడ్డళ్లతో నరికి నేలమట్టం చేశారు. చెట్ల వేర్లు వల్ల పాఠశాల భవనాల కిందకు వెళ్లి గోడలు, నాపరాళ్లకు పగుళ్లు చూపుతున్నాయనే సాకుతో చెట్లను తొలగించేశారు. అయితే వీటిని నరికేందుకు ముందుగా విద్యాశాఖ ఉన్నతాధికారులు, అటవీ శాఖ, గ్రామ పంచాయతీ అధికారుల అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. కానీ.. అలాంటి అనుమతులు ఏవీ తీసుకోకుండానే చెట్లను నరికివేశారనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చెట్లను నరికిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు కోరుతున్నారు.

భవనానికి డ్యామేజ్ అవుతుందని..

చెట్ల వేర్లు పాఠశాల భవనం కింద నాపరాళ్లను పైకి నెడుతున్నాయి. అందువల్ల చెట్లను నరికించాం. ఈ విషయాన్ని విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేశాం. చెట్లను తొలగించాలనే ఉద్దేశంతో నరకలేదు. పాఠశాల భవనానికి ఇబ్బందులు వస్తున్నాయని నరికించాం. పాఠశాల ఆవరణలో మళ్లీ మొక్కలు నాటి పెంచుతాం.

– భవాని, హెచ్ఎం, జడ్పీ ఉన్నత పాఠశాల, మద్దుకూరు